పెనుగాలుల బీభత్సం

- చేతికొచ్చిన పంట నేలపాలు
- గాలివీడులో 3 వేల ఎకరాల్లో దెబ్బతిన్న మామిడి
- సిద్దవటంలో రేకులషెడ్లు ధ్వంసం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా తయారైంది రైతన్నల పరిస్థితి. పంట దిగుబడి వస్తే ధర ఉండదు.. ధరలు బాగున్నప్పుడు పంట చేతికందదు. ఈ క్రమంలోనే జిల్లాలో గురువారం రాత్రి వీచిన పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలివీడులో 3 వేల ఎకరాల్లో మామిడి దెబ్బతినగా, సిద్దవటంలో నాలుగు రేకుల షెడ్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రతి యేటా ప్రకృతి వైపరీత్యాలతో మామిడి రైతులు కుదేలవుతున్నారు. ఈ ఏడాదీ ఆలస్యంగా పూత రావడంతో పాటు అరకొరగా కాపు కాయడంతో రైతులు ఒకింత ఆందోళన చెందుతూ వచ్చారు. ఈ దశలో జిల్లాలోని పలుచోట్ల పంట నేలమట్టం కావడంతో మామిడి రైతులు, వ్యాపారస్థులు దిగాలు చెందుతున్నారు. పెట్టిన ఖర్చులు కూడా వస్తాయో.. రావోనని లబోదిబోమంటున్నారు.


సిద్దవటం మండలం మందపల్లిలో నేలమట్టమైన అరటి పంట

గాలివీడు, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో మామిడి రైతులు కుదేలవుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో పలు పర్యాయాలు ఈదురుగాలులు, వర్షాల వల్ల చేతికందుతున్న మామిడి కాయలు నేలరాలి లబోదిబోమంటున్నారు. పూత దశలో మామిడి పంటకు వ్యాపించిన చీడపీడల వల్ల అసలే దిగుబడి తగ్గి దిగాలుతో ఉన్న రైతులను అకాల వర్షాలు మరింత కుంగదీశాయి. మండలంలో మొత్తం 3 వేల ఎకరాల్లో మామిడి పంట సాగైంది. ముఖ్యంగా ఎగువగొట్టివీడు, గోరాన్‌చెరువు, పేరంపల్లి, గోపనపల్లి, నూలివీడు, గుండ్లచెరువు, చీమలచెరువు, పూలుకుంట, కొర్లకుంట, పందికుంట తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేశారు. ఒక్కో రైతు 100 చెట్ల నుంచి 1500 చెట్ల వరకు సాగు చేయగా, వీటికి నీటి తడులను అందించడానికి ఒక్కో రైతు 5 నుంచి 10 బోర్లు కూడా వేశారు. దాదాపు ఒక ఎకరాకు అన్ని ఖర్చులతో సహా రూ.40 వేలు పెట్టుబడి పెట్టామని, తీరా చూస్తే అకాల వర్షాలు దెబ్బతీశాయని వాపోతున్నారు. ఈ ఏడాది మామిడి తోటలకు ఇన్సూరెన్స్ చెల్లించామని, ఉద్యానవన అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


గాలివీడులో ఈదురుగాలులకు కాయలు రాలిపోవడంతో బోసిపోయిన మామిడిచెట్లు

పంట అంతా నేలపాలైంది..



గాలివీడు గ్రామ పరిధి బుట్టిగారిపల్లెకు సమీపంలో 10 ఎకరాల్లో 500 మామిడి చెట్లు కలవు. ఈ ఏడాది దుక్కులకు, పోషణకు, మందులకు, దాదాపు రూ.4 లక్షల వరకు ఖర్చు చేశాను. పంట సాగు బాగా ఏపుగా ఉన్నది. ఏప్రిల్ 18న ఈదురుగాలులతో కూడిన వర్షంతో అపార నష్టాన్ని చవిచూడగా, మే 1న మరోమారు ఈదురుగాలుల వర్షం బీభత్సం సృష్టించడంతో పంట పూర్తిగా నేలపాలైంది. పది రోజుల వ్యవధిలోనే రెండు పర్యాయాలు ఈదురుగాలులు, అకాల వర్షాలు కురవడంతో పంట పూర్తిగా నేలపాలైంది. వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి దెబ్బతిన్న మామిడి తోట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- కొండ్రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, గాలివీడు

మద్దిరేవుల గ్రామంలో నేలరాలిన మామిడికాయలు



లక్కిరెడ్డిపల్లెలో..

అకాల వర్షాలు రైతన్నకు అపార నష్టాన్ని మిగిల్చాయి. గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు గాలీవాన బీభత్సం సృష్టించాయి. కోతకొచ్చిన మామిడికాయలు నేలపాలయ్యాయి. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. రెండు రోజులు ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ఈదురుగాలులు తోడవడంతో మండలంలోని మద్దిరేవుల, కస్తూరిరాజుగారిపల్లె, దప్పేపల్లె, లక్కిరెడ్డిపల్లె, కాకుళారం తదితర గ్రామాల పరిధిలోని మామిడి రైతుల తోటల్లో కాయలు పూర్తిగా నేలరాలిపోయాయి. పెనుగాలుల బీభత్సానికి మామిడి రైతులు నష్టాలపాలయ్యారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వాపోతున్నారు. ఈ ఏడాది మామిడి రైతు ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వానికి చెల్లించారు. ఉద్యాన అధికారులు నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

వీరబల్లిలో..

ప్రతియేటా అతివృష్టి, అనావృష్టి వల్ల మామిడి రైతులు నష్టపోతూనే వస్తున్నారు. గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులకు అరకొరగా కాసిన మామిడి కాయలు నేలరాలిపోవడంతో మామిడి రైతులు, వ్యాపారస్తులు దిగాలు చెందుతున్నారు. ఈ ఏడాదైనా కొంచెం లాభాలు వస్తాయన్న ఆశతో సాగుచేసినా ప్రకృతి సహకరించక నిరాశే మిగిల్చింది. అటు అతివృష్టి ఇటు అనావృష్టితో ఏదో కారణం చేత మామిడి రైతులు నష్టపోతున్నారు. దీనికి తోడు దళారి వ్యవస్థ అధికమైంది. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల నుంచి మామిడి కాయలు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.


వీరబల్లిలో నేలరాలిన మామిడి కాయలు

భాకరాపేటలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



సిద్దవటంలో..

మండలంలో గురువారం రాత్రి వీచిన పెనుగాలుల వర్షానికి భాకరాపేట, బొగ్గిడివారిపల్లె, పెద్దపల్లెలో అరటి, బొప్పాయి తోటలు నేలవాలిపోయాయి. క్షేత్రస్థాయిలో ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి శుక్రవారం దెబ్బతిన్న పంటలను పరిశీలించి అరటి 23 హెక్టార్లు, బొప్పాయి 60 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, నష్టపరిహారం పంటలు దెబ్బతిన్న ప్రతి రైతుకు అందిస్తామన్నారు. గాలివాన బీభత్సంలో పలు గ్రామాల్లో 40 దాకా విద్యుత్తు స్తంభాలు దెబ్బతినడంతో విద్యుత్‌శాఖకు రూ.15 లక్షలు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. గాలివాన బీభత్సంలో మిట్టపల్లె గ్రామంలో 4 రేకుల షెడ్లు దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. గాలివాన తో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలగడంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


మిట్టపల్లెలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

గంగమ్మ నిమజ్జనంతో ముగిసిన జాతర



రైల్వేకోడూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు జరిగిన గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు శుక్రవారం నిమజ్జనంతో ముగిసింది. బుధవారం అర్ధరాత్రి పొలిచాట, బలిచాట కార్యక్రమాలు ముగిసిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారికి దున్నపోతులను బలి ఇచ్చారు. తర్వాత గంగమ్మతల్లిని నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారి పొడవునా భక్తులు కిక్కిరిశారు. పొట్టేళ్లు, మేకపోతులు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ జాతరలో ఎలాంటి గొడవలకు తావులేకుండా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

రేపటి నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, మే 2 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు 4వ తేదీ ఆదివారం నుంచి 9వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ శుక్రవారం బి.మఠం మండల పరిషత్ సభాభవనంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్నిశాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, భక్తులకు స్నానం గదులు, బస చేయడానికి రూములు వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. ఉత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా పర్యవేక్షించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటిని 24గంటలు భక్తులకు అందించాలన్నారు. ఉత్సవాల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్‌వో నాగరాజు, ఎక్సైజ్ సీఐ వినోద్‌కుమార్, దేవదాయ శాఖ ఏసీ మల్లికార్జున, బి.మఠం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ, మైదుకూరు సీఐ శివశంకర్‌యాదవ్, డీపీవో రాజ్యలక్ష్మి, సీడీపీవో నిర్మలాదేవి, మైదుకూరు, బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్, తహశీల్దారు దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.26.70 లక్షలు

ఒంటిమిట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరాముని హుండీ ద్వారా రూ.26.70 లక్షలు ఆదాయం లభించింది. శుక్రవారం ఆలయంలో టీటీడీ సిబ్బంది హుండీలను లెక్కించారు. ఈ హుండీల ద్వారా నెల రోజులకు సంబంధించి పై తెలిపిన మొత్తం వచ్చిందని, ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బంగారు చోరీ కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

- రూ.75 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం


నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

మదనపల్లె అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల చోరీ కేసులో ఐదుగురి నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల నుంచి 835 గ్రాములు, రూ.75 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన యువకులు ఉన్న డబ్బులు, తమ వాహనాలను తాకట్టు పెట్టి బెట్టింగ్‌లో పోగొట్టుకున్నారని, ఈ బెట్టింగ్‌లకు బానిసై కురబలకోట మండలంలో గత నెల 25న ఓ ఇంట్లో ఐదుగురు యువకులు కలిసి బంగారు నగలను చోరీ చేశారన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మదనపల్లె డీఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ, క్రైం పార్టీ సీఐ చంద్రశేఖర్, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, తమ సిబ్బందితో కలిసి కురబలకోట మండలం, కనసానివారిపల్లె బస్టాప్ వద్ద గురువారం నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. ఇందులో కురబలకోటకు చెందిన పాలగిరి అమీర్‌సుహీల్ (26), పాలగిరి సమీర్ అహమ్మద్ (22), కన్నెమడుగు కిషోర్ (29), మొగసాల తిరుమలేష్ (27), టేకుపాలెం అరుణ్‌కుమార్ (27) కలిసి బంగారు నగలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వీరిలో కిషోర్, తిరుమలేస్, అరుణ్‌కుమార్‌లు వివిధ కేసుల్లో ఇంతకు ముందే నిందితులుగా ఉన్నారని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నారని, తల్లిదండ్రులు నిఘా పెట్టాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా ఈ కేసును ఛేదించిన హెడ్‌కానిస్టేబుల్స్ నరసింహులు, శంకర, పీసీలు రాఘవరెడ్డి, శంకరయ్య, శివకుమార్, చలపతి, దొరబాబు, వెంకటేష్, శ్రీనివాసులు, చక్రపాణి, ప్రేమకుమార్‌లకు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు.

ఇద్దరికి ఐదేళ్ల జైలు .. రూ.12 లక్షల జరిమానా

సిద్దవటం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున రూ.12 లక్షలు జరిమానా విధిస్తూ శుక్రవారం ఆర్ఎస్ఎస్ అడిషనల్ సెషన్స్ కోర్టులో తీర్పు వెలువడినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినయ్‌కుమార్ పర్యవేక్షణలో సిద్దవటం రేంజ్‌లో దాఖలైన కేసు (ఓఆర్ 71/2019-20, ఆర్ఎస్ ఎస్సీ 425/2022) ఆర్ఎస్ఎస్ అడిషనల్ సెక్షన్ కోర్టులో తీర్పు వెలువరించిందన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు సిద్దవటం మండలం మాధవరానికి చెందిన రామేటి సుబ్బరాజు, మలినేనిపట్నానికి చెందిన గంపాల యల్లయ్యలపై అభియోగాలు నిరూపితమయ్యాయన్నారు. సిద్దవటం రేంజ్‌లోని ముత్తుకూరు బీట్‌లో ఎర్రచందనం అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలిందన్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం దుంగల విలువ రూ.18 లక్షలు ఉంటుందన్నారు. తీర్పు అనంతరం సిద్దవటం రేంజ్ సిబ్బంది నిందితులను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఆమె తెలిపారు.


శిక్షపడిన వారితో ఫారెస్ట్ సిబ్బంది

కమీషన్ల కక్కుర్తి..!



- ప్రొద్దుటూరు పట్టణానికి ఓ ఐటీ ఉద్యోగి కడుపునొప్పితో బాగా పేరున్న మూడు ఆసుపత్రులకు తిరిగి వైద్యులను ఆశ్రయించారు. వెళ్లిన ప్రతిచోటా వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు చేయించమని సిఫారసు చేశారు. వారి సూచనల మేరకు కంప్లీట్ బ్లడ్‌పిక్చర్, సీరం కాల్షియం, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, సీఆర్‌పీలతో పాటు కొలనోస్కోపీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేయించారు. రిపోర్ట్స్ అన్నీ నార్మల్‌గా ఉండటంతో రివ్యూ స్కానింగ్‌లు కూడా జరిగాయి. ఫలితాలు మాత్రం అన్నీ నార్మల్‌గా వచ్చాయి. సుమారు రూ.12 వేలు ఖర్చు చేశాక తనకు వచ్చిన కడుపునొప్పి గ్యాస్ట్రబుల్ వలన అని వైద్యులు నిర్ధారణ చేశారు.

- 45 సంవత్సరాల మహిళ మూడు రోజులుగా తలనొప్పి, వాంతులతో ఇబ్బంది పడుతూ తల, మెడ, నరాల స్పెషలిస్టు వద్ద చూపించగా వెంటనే ఆయన తలకు ఎంఆర్ఐ స్కానింగ్ చేయమని సిఫారసు చేశారు. స్కానింగ్‌కు డబ్బులు లేవు, మందులు రాసివ్వాలని ఆమె కోరగా సమస్య ఏమిటో స్పష్టంగా తెలియనప్పుడు ఏ మందులు రాయాలి.. ఎంఆర్ఐ తీస్తే నరాల్లో రక్తప్రసరణ ఎలా ఉందో, రక్తం గూడు కట్టిందా... లేక మెడలో క్యాన్సర్ కణుతులు ఉన్నాయా.. ఏదీ తేలకుండా మందులు ఎలా రాసేదని చెప్పారు. దీంతో బిత్తరపోయిన ఆ మహిళ వెంటనే సుమారు రూ.5 వేలు ఖర్చు చేసి ఎంఆర్ఐ స్కానింగ్ చేయించగా అంతా నార్మల్ అని రిపోర్టు రావడంతో ఆ తర్వాత వైద్యుడు మందులు రాసిచ్చారు.

- అవసరం లేకున్నా రక్త పరీక్షలకు వైద్యుల సిఫారసు
- ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో నిలువుదోపిడీ
- ఫీజుల్లో 60 శాతం వైద్యులకు కమీషన్..!
- హద్దులు దాటుతున్న ఆర్ఎంపీ వైద్యం
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



ప్రొద్దుటూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): వైద్యుడు నాడి పట్టి వైద్యం అందించే రోజులు గగనం అయ్యాయి. రోగి తనకు ఇబ్బంది పెడుతున్న లక్షణాలను స్పష్టంగా వివరిస్తున్నా వైద్యులు తాము చదువుకున్న చదువు, అనుభవంతో రోగి లక్షణాలను బట్టి వైద్యం అందించే రోజులు కూడా కనుమరుగు అవుతున్నాయి. కడుపునొప్పి, దగ్గు, తలనొప్పి, జ్వరం, ఏది వచ్చినా సరే ఆస్పత్రి మెట్లు ఎక్కితే చాలు.. రక్త పరీక్షలు, స్కానింగ్‌లు అంటూ డాక్టర్లు సిఫారసు చేస్తున్నారు. అవసరం లేకున్నా అనేక రకాల పరీక్షల పేరుతో రోగుల జేబులకు చిల్లు పెడుతున్నారు. ఇదే అదునుగా ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకులు కమీషన్ దందాలకు తెరలేపారు. చాలా కాలంగా నడుస్తున్న ఈ కమీషన్ల దందా ప్రస్తుతం ఒక వ్యాపారంగా మారింది. ఈ మొత్తాల్లో వైద్యులకు, ఆర్ఎంపీలకు కమీషన్ల రూపంలో వాటాలను ముట్టచెప్పుతుండడంతో కొంత మంది వైద్యులు కూడా రోగి చెప్పే సమస్య కన్నా రక్తపరీక్షలు, స్కానింగ్‌లకు చేసే సిఫార్సులపైనే ఆసక్తి చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నెలకొన్న ఈ జాడ్యంపై పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని విమర్శలున్నాయి.

వైద్యులకు 60 శాతం కమీషన్

జిల్లాలో రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు దాదాపు 400కిపైగా, డయాగ్నోస్టిక్‌సెంటర్లు 50కి పైగా ఉన్నాయి. సీటీ స్కాన్‌లు 15-20 వరకు ఉన్నట్లు అంచనా. ల్యాబ్‌లలో యజమానులు కొంతమంది వైద్యులతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ డాక్టర్ రెఫర్ చేసే వైద్య పరీక్షలపై 60 శాతం మొత్తాన్ని కమీషన్ రూపంలో అందుతున్నట్లు సమాచారం. ల్యాబ్‌లో నిర్వహించే రక్త పరీక్షలకు ఏ పరీక్షకు ఎంత తీసుకోవాలనే ధరలు ప్రభుత్వం నిర్ణయించడం లేదు. ఇదే కొంతమందికి ఇష్టారాజ్యంగా మారింది. ఒక వైద్యుడు ఒక స్కానింగ్ సెంటర్‌కు సిఫార్సు చేస్తే ఆ రోగి ఆ స్కానింగ్ సెంటర్‌లో మాత్రమే స్కానింగ్ చేయించుకోవాలి. ఇతర స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేయిస్తే ఆ వైద్యుడు ఒప్పుకోడు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులలో సుమారు 50 శాతానికి పైగా అటాచ్డ్ ల్యాబ్‌లు ఉన్నాయి. దీంతో ఈ ఆసుపత్రి వైద్యుడు వేరే ల్యాబ్‌లో చేయించిన రిపోర్టులను ఒప్పుకోరు. తమ ల్యాబ్‌లో మరోసారి పరీక్షలు చేయించాల్సిందే.

ఆర్ఎంపీల దోపిడీ

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స నిర్వహించే ఆర్ఎంపీ క్లినిక్‌లలో వైద్యసేవలు హద్దులు మీరుతున్నాయి. తక్కువ ఖర్చులో ఆర్ఎంపీ వద్ద వైద్యం అందుతుందని పేదలు వారిని ఆశ్రయిస్తే కమీషన్లకు ఆశపడి ఒక్కో రోగి నుంచి సుమారు రూ.1200 నుంచి రూ.1400 విలువచేసే రక్త పరీక్షలు చేయిస్తున్నారు. పైగా ఆర్ఎంపీ క్లినిక్‌ల వద్దకే ల్యాబ్‌ల్లో పనిచేసే అటెండెంట్లు వచ్చి రోగుల బ్లడ్‌శాంపిల్స్‌ను తీసుకెళ్లి గంటలోపు రక్తపరీక్షల నివేదికలు అందజేస్తూ రోగికి తెలియకుండానే పిండి పిప్పి చేస్తున్నారు.

ఒక్కోచోట ఒక్కో రేటు

ల్యాబ్‌లను బట్టి, ప్రాంతాన్ని బట్టి రక్త పరీక్షలకు వసూలు చేసే మొత్తాల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కడపలో ల్యాబ్‌లలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇవేకాక హెల్త్ చెకప్, మాస్టర్ హెల్త్‌చెకప్ అంటూ ఆఫర్లు ఇస్తూ ఇంటి వద్దనే శాంపిళ్ల సేకరణ, ఇండ్ల వద్దకే రిపోర్టులు అందజేత వంటి సదుపాయాలను అందిస్తూ రోగులను బురిడీ కొట్టిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా నడుస్తున్న కమీషన్ల దందా, అనధికారిక ల్యాబ్‌ల నిర్వహణపై వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి రెండు రోజులుగా డీఎంఅండ్‌హెచ్‌వో నాగరాజును ఫోన్‌లో సంప్రదించగా తాము ప్రధాన మంత్రి పర్యటన కార్యక్రమాల్లో బిజీగా ఉన్నానంటూ దాటవేశారు.



అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం



● కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

● సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

మహిళల విజయ దరహాసం





సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు

అజ్ఞాతంలోకి 'ఎర్ర' దొంగలు

● పూచీకత్తు ఇచ్చిన ఇద్దరికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరి పూచీకత్తుతో ఐదుగురు నిందితులు జైలు నుంచి విడుదలయ్యారు. వీరిలో ఒకరు చనిపోగా, మిగిలిన నలుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో పూచీకత్తు దారులకు భారీ జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ అధికారి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా పెరియవళ్లి గ్రామానికి చెందిన ఎ.రమేష్, కుమార్, డి.చిన్నస్వామి, సుధాకర్, ఏలుమలై.. చిత్తూరు జిల్లా ఐరాల పరిధిలో ఎర్రచందనం దుంగలు అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదేళ్ల కిందట ఐరాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది రోజుల తర్వాత వీరికి పీలేరుకు చెందిన జి.శేషాద్రి నాయుడు, ప్రసాద్ ష్యూరిటీ ఇచ్చి బెయిల్‌పై విడుదల చేయించారు. బెయిల్‌పై విడుదలైన ఐదుగురిలో ఎ.సుధాకర్ మృతి చెందాడు. మరో నలుగురికి న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్టు చేసి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సొంత పూచీకత్తుపై విడుదల చేయించిన ఇద్దరికి.. ఒక్కో నిందితుడికి రూ.20 వేల చొప్పున జరిమానా చెల్లించాలంటూ శుక్రవారం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు.

జీవనోపాధుల సేవా కేంద్రం.. రైతులకు ఉపయోగం

వీరబల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): జీవనోపాధుల సేవా కేంద్రం రైతులకు ఉపయోగమని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ గంగార్జున తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సముదాయంలో జీవనోపాధుల సేవా కేంద్రం మండల వ్యవసాయ ఉత్పత్తుల సమాఖ్య అధ్యక్షుడు రాచన్న ప్రారంభించారు. సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా జీవనోపాధులు కల్పించడం ద్వారా ఆదాయం పెంపొందించడమే లక్ష్యమన్నారు. మొదటి విడతలో వీరబల్లి, సోమవరం గ్రామంలోని 300 కుటుంబాలను సమీకృత వ్యవసాయ పద్ధతులపై కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏపీఎంలు ఖాదర్‌వలి, రమేశ్‌బాబు, వెంకట్రమణ, సీసీలు గంగాధర్, సుధాకర్, నాగేంద్ర, ఐఎఫ్‌సీ మండల యాంకర్ పర్సన్ అనిత, సీఆర్పీలు జ్యోతి, అనురాధ, రెడ్డెమ్మ, రైతు మిత్ర జనమేజయుడు, బీవోడీ సభ్యులు, ఉపాధి హామీ టీఏ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సచివాలయ ఉద్యోగిపై వైసీపీ మూకల దాడి

● ముగ్గురు యువకులపై కేసు నమోదు

తంబళ్లపల్లె, మే 2(ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడిని దుర్భాషలాడినందుకు ప్రశ్నించిన ఓ సచివాలయ ఉద్యోగిపై వైసీపీ మూకలు కత్తితో దాడి చేసి గాయపరిచాయి. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కృష్ణమూర్తి కుమారుడు గణేశ్(28) చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కురబలకోట మండలం మట్లివారిపల్లె నివాసి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆయన స్నేహితుడు. కొన్ని రోజుల క్రితం తంబళ్లపల్లెకు చెందిన మున్వర్.. ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి, బస్టాండులో బహిరంగంగా దూషించాడు. ఈ విషయం అతను తన స్నేహితుడైన గణేష్‌కు తెలిపాడు. దీంతో తన స్నేహితుడిని ఎందుకు తిట్టావని గణేశ్, మున్వర్‌ను ప్రశ్నించగా.. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి టీడీపీకి చెందిన వ్యక్తి అని, నీవెందుకు అతడికి సపోర్ట్ చేస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో పాటు, నీ అంతు చూస్తానని బెదిరించాడు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం గణేశ్ స్నేహితులతో కలసి తంబళ్లపల్లెలో చికెన్ పకోడా సెంటర్ వద్ద ఉండగా మున్వర్, మహమ్మద్, శశి ద్విచక్రవాహనంలో వచ్చి కత్తితో దాడి చేశారు. విషయం గమనించి స్థానికులు బిగ్గరగా కేకలు వేయడంతో వారు పారిపోయారు. గాయపడిన గణేశ్‌ను స్నేహితులు తంబళ్లపల్లె సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమచికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు గణేష్‌ను పరామర్శించారు. దాడి ఘటనను పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర తీవ్రంగా ఖండించారు. మదనపల్లె జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న గణేష్‌ను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, పార్లమెంట్ తెలుగు యువత జనరల్ సెక్రటరీ షేక్ అయూబ్ బాషా, తంబళ్లపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, బీసీ నాయకుడు తులసీధర్‌నాయుడు, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, కట్టా దొరస్వామి నాయుడు, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గణేశ్‌ను పరామర్శిస్తున్న శ్రీరాం చినబాబు, టీడీపీ నాయకులు, గణేశ్ కాలికి గాయమైన దృశ్యం

బాలుపల్లె అడవిలో మంటలు

● అప్రమత్తమైన అటవీశాఖాధికారులు



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

రైల్వేకోడూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలుపల్లె అడవిలో గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగాయి. అటవీశాఖ అధికారులు రాత్రి అప్రమత్తమై మంటలను ఆర్పే పనిలో పడ్డారు. అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్, రైల్వేకోడూరు సబ్‌డీఎఫ్‌వో సుబ్బరాజ్, బాలుపల్లె రేంజర్ ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వివేక్, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన అటవీశాఖ సిబ్బంది కలసి బాలుపల్లె అడవిలోని కంగుమడుగు, మొగిలిపెంట ప్రాంతాల్లో ఉన్న అడవిలో మంటలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీనికితోడు శుక్రవారం వర్షం తోడైంది. దీంతో మంటలను ఆర్పడానికి వరుణదేవుడు కూడా సహకరించాడు. అప్పటికే మంటల్లో అడవిలో జీవిస్తున్న జీవరాసులు కాలిపోయాయి. అనేక అరుదైన చెట్లు, మొక్కలు కాలిబూడిదయ్యాయి. పచ్చని చెట్లు మంటలకు మాడిపోయాయి. అడవిలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించడం, బీడీలు, సిగిరేట్లు తాగి పడవేయడంతోనే మంటలు చెలరేగుతున్నాయని అధికారులు గుర్తించారు. బాలుపల్లె అడవిలో మొదలైన మంటలు తుంబూరుతీర్థం, తిరుమల వైపు వెళ్లాయని అధికారులు అంటున్నారు. అయితే వర్షం పడడంతో చాలా వరకు మంటలు ఆరిపోయినట్లు అటవీ శాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎర్రచందనం దుంగలు పట్టివేత

● వాహనం స్వాధీనం ● దొంగలు పరార్

ఒంటిమిట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట ఫారెస్ట్ అధికారులు శుక్రవారం ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దుంగలను క్యాబేజీ మూటల మధ్యలో దాచి ఐచర్ వాహనంలో తరలిస్తుండగా స్థానిక అటవీశాఖ అధికారులు వెంటపడి పట్టుకున్నారు. అటవీశాఖ అధికారులకు ముందుగా సమాచారం అందడంతో మాటు వేసి ఒంటిమిట్ట-కడప జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు తెలిసింది. ఐచర్ వాహనంలో సుమారు 80కి పైగా దుంగలు ఉన్నట్లు సమాచారం. ఇన్‌చార్జి రేంజర్ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది మాటువేసి పట్టుకున్నట్లు తెలిసింది. ఐచర్ డ్రైవర్, మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం. పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని, పరారైన వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ఈ ముఠాను గుర్తించేందుకు అటవీశాఖ అధికారులు ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



దుంగలతో పట్టుబడిన ఐచర్ వాహనం

చెరువులో మునిగి ఒకరి మృతి

నిమ్మనపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): చేపల కోసం వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతిచెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు.. రాచవేటివారిపల్లి పంచాయతీ ఆచార్లపల్లికి చెందిన బోడుమల్ల జగన్నాథం (40) బుధవారం గ్రామానికి సమీపంలో ఉన్న ముసలినాయుని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. తన భర్త ఎక్కడికో వెళ్లి ఉంటాడని భార్య బుజ్జమ్మ కూడా అంతగా పట్టించుకోలేదు. అయితే చెరువులో శవం తేలుతోందని శుక్రవారం స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని వెలికితీసి విచారణ చేశారు. చనిపోయింది తన భర్తేనని బుజ్జమ్మ నిర్ధారించింది. కాగా, చేపలు పట్టే యత్నంలో చెరువులో మునిగి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పురుగుల మందు తాగి యువతి..



ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన యువతి

మదనపల్లెఅర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల కథనం మేరకు ములకలచెరువు మండలం, చిన్నమొరవపల్లెకు చెందిన అమర నాథరెడ్డి భార్య శిరీష(26) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో నెల రోజుల క్రితం వరకు నర్సుగా పనిచేసేది. ఆమె భర్త ఎక్స్‌క వేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వివాహమై ఏడేళ్లైనా పిల్లలు కలుగలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కటుంబసభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ములకలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు..



మృతి చెందిన సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

మదనపల్లెఅర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. నందలూరు గ్రామానికి చెందిన కొందరు గంగి రెద్దులు ఆడించేవారు. గురువారం రాత్రి రామసముద్రం మండలం, చెంబకూరు సమీపంలో యల్లమ్మ ఊరేగింపులో పాల్గొన్నారు. వారిలోని సుబ్రహ్మణ్యం (35) అనే యువకుడు బ్యాటరీకి చార్జీ చేయడానికి కరెంటు స్తంభం లైన్‌కు తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రామసముద్రం పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సుభాషిణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రామ సముద్రం ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



- ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్
- లీప్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చిన విద్యాశాఖ
- ఉపాధ్యాయులకు విముక్తి కల్పించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



హమ్మయ్యా...
యాప్‌ల గోల తప్పింది

కడప ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులకు నరకం చూపారు. విద్యార్థుల హాజరుకు యాప్, ఉపాధ్యాయుల ముఖ హాజరుకు యాప్, మధ్యాహ్న భోజనం అమలుకు యాప్, మరుగుదొడ్ల నిర్వహణకు యాప్, విద్యార్థుల మార్కులు అప్‌లోడ్‌కి యాప్ ఇలా యాప్‌లతో ఉపాధ్యాయులు అల్లాడి పోయారు. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు యాప్‌ల గోలతో ఆపసోపాలు పడాల్సి వచ్చేది. దీంతో తాము బోధనపై దృష్టి సారించలేకపోతున్నామని అప్పటి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టింది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు యాప్ కష్టాల నుంచి విముక్తి కల్పించింది. ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్‌ను అమలు చేయనుంది. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులంటే విద్యార్థులకు బోధన చేయాలి... కానీ గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్‌లతో ఉపాధ్యాయులు బోధన పక్కనపెట్టాల్సి వచ్చేది. ఉపాధ్యాయు లు నిత్యం పదికి పైగా యాప్‌లతో సమాచారం పంపాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్‌ల కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తామని యువగళం పాదయాత్రలో నారాలోకేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రిగా ఆయన ఇక పాఠశాల స్థాయిలో ఒకే యాప్‌ను తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

కడప జిల్లాలో మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు 2047 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1.40 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా 7821 మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో యాప్‌ను ప్రవేశపెట్టారు. కేవలం ఉపాధ్యాయులపై కక్షసాధింపులా యాప్‌లను ప్రవేశ పెట్టారన్న విమర్శలు వచ్చినా.. యాప్‌ల కష్టాల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు రోడ్డెక్కినా నాటి ప్రభుత్వం స్పందించ లేదు. దాదాపు పదికిపైగా యాప్‌లతో నిత్యం ఉపాధ్యాయులు కుస్తీ పడాల్సి వచ్చేది.

ఇక అన్నింటికి ఒకేయాప్

ప్రభుత్వం తాజాగా లెర్నింగ్ ఎక్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో నూతన యాప్‌ను తీసుకువచ్చింది. లీప్ యాప్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసింది. కడప జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు తప్పనిసరిగా తమ మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఈ యాప్ ఆండ్రాయిడ్ 8, ఇతర వెర్షన్ మొబైల్ ఫోన్‌లలో పనిచేస్తుందని విద్యాశాఖ అధికారులు చెబుతు న్నారు. ప్రస్తుతానికి స్కూల్ అటెండెన్స్ యాప్‌లో విని యోగిస్తున్న లాగిన్లను పాస్‌వర్డ్‌లను ఉపయోగించి నూతన యాప్‌లో లాగిన్ కావాలని స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యా యుల, విద్యార్థుల హాజరు, సెలవులను యాప్‌లో మాత్రమే నమోదు చేయాల్సి ఉంది.

పనిభారం తగ్గింపు



నూతన యాప్ వల్ల ఉపాధ్యాయుల పనిభారం తగ్గుతుంది. పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారం ఒకేయాప్ నమోదు చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉం టాయి. గతంలో ఉన్న యాప్‌లను అన్‌ఇన్‌స్టాల్ చేసే ముందు యాప్‌లకు సంబంధిం చిన లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఒకచోట నమోదు చేసుకోవాలి.

- షంషుద్దీన్, డీఈఓ

మత్స్యశాఖ ఏడీగా శ్యామలమ్మ బాధ్యతలు

కడప రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఏడీగా శ్యామలమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈమె నంద్యాల ఏడీఏగా పనిచేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి, ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడతామన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పిడుగుపాటుకు యువకుడి మృతి



నాగేశ్వర్ మృతదేహం

మైలవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన మేకల నాగేశ్వర్ (26) అనే వ్యక్తి పిడుగుపాటుకు మృతి చెందాడు. తలమంచిపట్నం పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... గొల్లపల్లెలోని మిరపకాయల కలంలో మిరపకాయలను సంచులకు ఎత్తే సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు మెరువడంతో ఆ శబ్దానికి నాగేశ్వర్ భయాందోళనకు గురై ఒక్కసారిగా కిందపడిపోయాడు. వెంటనే అక్కడున్నవారు వద్దిరాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగేశ్వర్ కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక పాపకు మూడేళ్లు కాగా.. బాబు పుట్టి వారం రోజులైందని, అంతలోనే ఈ దుర్ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు,బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. నాగేశ్వర్ భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు తలమంచిపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

65 మద్యం బాటిళ్లు స్వాధీనం



అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

ఎర్రగుంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): రైలులో అక్రమంగా తరలిస్తున్న 65 మద్యం బాటిళ్లను ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు పూణే జయంతి ఎక్స్‌ప్రెస్‌లో ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకువెళుతున్న 65ఫుల్ మద్యం బాటిళ్లను పట్టుకు న్నారు. వీటిని పాండిచ్చేరి నుంచి నంద్యాలకు తీసుకెళుతు న్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైలుదిగి మద్యం బాటిళ్లతో వెళుతున్న వారిని ఫ్లాట్‌ఫారంపై పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

కడప క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం కడప నగరంతో పాటు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లోని అన్ని కూడళ్లలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది రద్దీ ప్రదేశాల్లో, ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. వారి వివరాలను ఆరా తీశారు. లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఈదురుగాలుల బీభత్సం.. దెబ్బతిన్న పంటలు




పడిపోయిన మామిడి చెట్ల వద్ద రైతు జగన్‌మోహన్‌రెడ్డి, ఈదురుగాలులకు పడిపోయిన అరటి పంట

సీకేదిన్నె, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని చెట్లు కరెంటు స్తంభాలు సైతం పడిపోయాయి. బొగ్గులపల్లె పంచాయతీ గూడావాండ్లపల్లె, బుగ్గలపల్లె, ఇప్పెంట పంచాయతీల్లో మామిడి, అరటి రైతులు భారీగా నష్టపోయారు. గూడావాండ్లపల్లెలో రైతు జగన్‌మోహన్‌రెడ్డి తన ఆరు ఎకరాల పొలంలో దాదాపు నాలుగేళ్ల వయస్సు ఉన్న వందకుపైగా మామిడి చెట్లు నేలకొరిగాయి. కాపుకు వచ్చి పంట చేతికొచ్చే సమయంలో చెట్లు నేలకొరగడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా క్రిష్టారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఇప్పెంటలోని నాగరాజు, తదితరుల అరటి చెట్లు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఖాజీపేట మండలంలో...



రేకులు కొట్టుకుపోయిన గృహం

ఖాజీపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించే రైతన్నలకు ఏదో ఒక రూపంలో నష్టం వాటిల్లుతోంది. గురువారం రాత్రి ఖాజీపేట మండల పరిధిలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో రైతన్నలు నూర్పిడి చేసేందుకు పట్టలపై వేసిన నువ్వుల పంట కొట్టుకుపోయి నువ్వులు నేలపాలయ్యాయి. అలాగే మండల పరిధిలోని పుల్లూరు మాలవాడలో ఓబయ్య, జ్యోతిలు గృహాలకు ఏర్పాటు చేసుకున్న రేకులు కొట్టుకుపోయాయి. దీంతో ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పోరుమామిళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో స్వాతి అనే వివాహిత విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శుక్రవారం సాయంత్రం విష ద్రావణం తాగి ఆ మహిళ అపస్మారక స్థితిలో ఉండడంతో గమనించిన కొందరు 108కు సమాచారం ఇవ్వడంతో వారు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది. అక్కడ వారికి తన పేరు స్వాతి అని చెప్పినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని శవం లభ్యం

పోరుమామిళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మనపల్లె నుంచి కట్టకింద వెళ్లే దారి మధ్యలో గుర్తుతెలియని శవం బయటపడినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కొందరు ఆ దారి వెంబడి వెళుతుండగా నీటిలో తేలియాడుతూ శవం కంటపడిందని తెలిపారు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదు. కాగా ఇది కలసపాడు పరిధిలోకి వస్తుందా, పోరుమామిళ్ల పరిధిలోకి వస్తుందా అని ఆ ప్రాంత వాసులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక తర్జనభర్జనపడుతున్నారు. అయితే పోలీసులకు మాత్రం ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ప్రొద్దుటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అర్బన్, రూరల్ పరిధిలోని రెండు రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం వేర్వేరుగా దాడులు నిర్వహించారు. ప్రొద్దుటూరు సూపర్ బజార్‌వీధిలోని డీలర్ ఎరికలరెడ్డికి చెందిన షాపునెంబరు 14లో విజిలెన్స్ సీఐ శివన్న దాడులు నిర్వహించారు. 96.50 క్వింటాళ్ల బియ్యం, 525 ప్యాకెట్ల చెక్కర నిల్వల్లో తేడాలున్నాయి. దీంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే పెద్ద శెట్టిపల్లెలోని డీలర్ బి.ఆదిలక్ష్మికి చెందిన షాపు నెంబరు 93 రేషన్ దుకాణంపై విజిలెన్సు సీఐ నారాయణప్ప ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో షాపులో 44.50 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, 306 చెక్కర ప్యాకెట్లు నిల్వల్లో తేడాలున్నట్లు గుర్తించారు. దీంతో ఆదిలక్ష్మిపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడుల అనంతరం బియ్యం చెక్కర నిల్వలను సివిల్ సప్లయి డీటీ మల్లికార్జున, ఎఫ్ఐ మహేంద్రరెడ్డిలకు విజిలెన్సు అధికారులు అప్పగించారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు.. తహసీల్దారు విచారణ

ప్రొద్దుటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె పంచాయతీ శంక రాపురం గ్రామానికి చెందిన పల్లబోతుల సుబ్బలక్షుమ్మ అనే వృద్ధురాలు పెద్దశెట్టిపల్లె, చౌడూరు గ్రామ పొలాల్లోని తన 170 ఎకరాల భూమిని 12 మంది ఆక్రమించారని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహసీల్దారు గంగయ్య సుబ్బలక్షుమ్మ ఆరోపించిన 12 మందికి నోటీసులు జారీ చేసి.. శుక్రవారం తన కార్యాలయంలో విచారణ చేపట్టారు.

కాగా విచారణకు 12 మందిలో ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. వీరిని సుబ్బలక్షుమ్మకు సంబంధించి 170 ఎకరాల భూములను ఆక్రమించారా అని తహ సీల్దారు ప్రశ్నించారు. ఇందుకు వారు సుబ్బలక్షుమ్మ భూములకు సంబంధించిన ఆధారాలు చూపమన్నారు. ఇందుకు సుబ్బలక్షుమ్మను ఆధారాలు చూపమని కోరగా.. తన ఆస్థి పత్రాలు చూపడానికి వాయిదా కోరింది. దీంతో మే 14 నాటికి విచారణను తహసీల్దారు వాయిదా వేశారు. ఈ విచారణలో డిప్యూటీ తహసీల్దారు వెంకటసాయినాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్వో సుధీర్‌లు పాల్గొన్నారు.

పెనుగాలులకు తీవ్ర నష్టం


ఓబులవారిపల్లె: దెబ్బతిన్న అరటి తోట వద్ద రైతు కంచర్ల శ్రీనివాసులు

పెనగలూరు మండలం ఓబిలి వద్ద నేలరాలిన మామిడి కాయలు

ఓబులవారిపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఏడాదికాలం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ కాపాడుకున్న అరటి పంట చేతికొచ్చే సమయంలో పెనుగాలులు రైతు నోట్లో మట్టి కొట్టాయి. మండలంలోని చిన్నఓరంపాడు, కమ్మపల్లెకు చెందిన కంచర్ల ప్రభాకర్, కంచర్ల శ్రీనివాసులు సుగంధాలు (కర్పూరం)రకం అరటి సాగు చేశారు. పంట పూర్తిస్థాయి దిగుబడి వచ్చింది. ఒక్కో గెల సుమారు 20 కిలోలు పైనే ఉంది. గత వారంలో 10 గెలలు మాత్రమే కోతకు రావడంతో వ్యాపారి కోత మొదలుపెట్టారు. రెండు మూడు విడతల్లో పూర్తిస్థాయి పంట అందుతుందనే ఆనందంలో ఉండగానే గురువరం రాత్రి వీచిన గాలులకు అరటి చెట్లు నేలకొరిగాయని రైతులు కంచర్ల ప్రభాకర్, కంచర్ల శ్రీనివాసులు ఆవేదన చెందారు. ఒక ఎకరాలో అరటి సాగుకు సుమారు రూ.లక్ష ఖర్చు వస్తుందని, కనీసం ఖర్చులకు కూడా రాకుండా గాలి నష్టాలపాలు చేసిందని, ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

పెనగలూరులో నేలరాలిన మామిడి

పెనగలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పెనుగాలులకు సిద్దవరం, ఓబిలి గ్రామాల పరిధిలో మామిడి రైతులకు భారీ నష్టం జరిగింది. అసలే ఈ యేడాది మామిడి కాపు బాగా లేదని, ఖర్చులకు కూడా రావేమోనని రైతులు అనుకుంటుండగా రైతులను పెనుగాలులు పూర్తిగా దెబ్బతీశాయి. ఉన్న కాస్తా కాయలు కూడా పెనుగాలుల దెబ్బకు నేలరాలిపోయాయి. కాగా కోడిచెన్నయ్యగారిపల్లె, పద్మయ్యగారిపల్లె గ్రామాల్లో భారీ వర్షం కురిసిందని ఆ గ్రామ ప్రజలు తెలిపారు. పదును వర్షం పడి ఉంటుందంటున్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణోత్సవం


గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

పెనగలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరులో వెలసిన వేణుగోపాల స్వామి దేవాలయంలోని నూతన కల్యాణ మండపంలో గురువారం రాత్రి రుక్మిణి, సత్యభామ సమేతుడైన వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రూ.15 లక్షలతో గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు కల్యాణ మండపం ని ర్వహించారు. అమెరికాలో స్థిరపడిన కమ్మ సంఘంలోని ఓ భక్తుడు వరు డు, వధువు గదులను నిర్మించారు. రూ.15 లక్షల విరాళంతో ఉపసర్పంచ్ డి.చిన్నవెంగళరెడ్డి కల్యాణ మండపం చుట్టూ ప్రహరీ నిర్మించారు. కల్యాణోత్సవం తర్వాత భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. అనంతరం నూతన మండపంలో హరికథాగానం జరిగింది. గరుడ వాహనంపై రుక్మిణి, సత్యభామ సమేతుడైన వేణుగోపాలుడు భక్తులకు దర్శనమిచ్చారు.

ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

లక్కిరెడ్డిపల్లె, మే2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ సంస్థ కోఆర్డినేటర్ ముబారక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష యోజన, జీవన జ్యోతి, అటల్‌పెన్షన్ యోజన పథకాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటిని ఎలా ఎదుర్కోవాలి అన్న విషయాలపై మహిళలకు తెలిపారు. ఆర్‌హెచ్ జీబీయంఎస్ఎస్ సంస్థ సిబ్బంది బాబు, వెంకటేశ్, వెంకటయ్య, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, మే2(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మద్దిరేవుల గ్రామ పరిధిలోని మార్లవాండ్లపల్లికి చెందిన రవికుమార్‌రెడ్డి మామిడి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం, ఈదురు గాలుల బీభత్సంతో మద్దిరేవుల, కస్తూరిరాజుగారిపల్లె, దప్పేపల్లె, లక్కిరెడ్డిపల్లె, కాకుళారం తదితర గ్రామాల పరిధిలోని మామిడి తోటల్లో కాయలు పూర్తిగా నేలరాలిపోయాయన్నారు.

'పాత పెన్షన్‌ను పునరుద్ధరించండి'


డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), మే2(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ పునరుద్ధరించాలని సీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బాజీపఠాన్ పేర్కొన్నారు. శుక్రవారం డీఆర్‌వో మధుసూదన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకటజనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్‌కు పరిష్కారం చూపిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ చీరల కిరణ్ మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ఒకటే పెన్షన్ ఉండాలన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



రామాపురం: కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

రామాపురం, మే2(ఆంధ్రజ్యోతి): బాలికల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని, ఇందుకోసం కిశోర బాలికల వికాసం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ రామాపురం సెక్టార్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ తెలిపారు. మండలంలోని సరస్వతీపల్లి గ్రామంలో శుక్రవారం కిశోర బాలికల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కిశోర బాలికల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కిశోర బాలికల వికాసం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 12 నుంచి 18 లోపు బాలికలు తమ లక్ష్యాలను ఏర్పచుకొని ముందుకు సాగాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కిశోర బాలికల వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, రహజాన్, ఝాన్సీ, సచివాలయ మహిళా పోలీస్ మౌనిక, ఏఎన్‌యం హైమావతి, ఆశావర్కర్, కిశోర బాలికలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరం

లక్కిరెడ్డిపల్లె, మే2(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని, తల్లిదండ్రులకు మంచి పిల్లలుగా, విద్యను అందించిన గురువులకు మంచి శిష్యులుగా ఎదగాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలసదనంలో కిశోరి వికాసం, వేసవి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, పోషకాహారం, ఆరోగ్యంపై కిశోర బాలికలు దృష్టి సారించలన్నారు. మానవ అక్రమ రవాణా, ఆత్మ రక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐపీపీఎస్ పీవో రవికుమార్ మాట్లాడుతూబాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ మనీ, వెలుగు సీసీలు భూషణ్‌రెడ్డి, కుళ్లాయప్ప, అంగన్వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: బాలికల భవితకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోనీ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి లావణ్య, అంగన్వాడీ టీచర్లు జరీనా, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: కౌమార బాలికల సాధికారతే లక్ష్యంగా పనిచేద్దామని అంగన్వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ పిలుపునిచ్చారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కిశోరి వికాస కార్యక్రమంపై జిల్లా అధికారుల ఆదేశానుసారం అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు మహిళలకు శిక్షణ ఏర్పాటు చేశారు.

పెనగలూరు: కిశోర బాలికలు బాల్య వివాహాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ అంగన్వాడీ సీనియర్ సూపర్‌వైజర్‌లు రాజేశ్వరి, విజయకుమారి, విశాలాక్షి పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయాల పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాల్లో బాలికలకు కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.పెనగలూరు, చక్రంపేట, కొండూరులో కార్యక్రమాలు నిర్వహించారు.

పుల్లంపేట : అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ ఆకేపాడు శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన బాలబాలికలకు కిశోరి వికాసంపై నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఉపాధ్యాయులు అశోక్, యుటీఎఫ్ నాయకుడు రమణమూర్తి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీకి పురస్కారం

రాయచోటిటౌన్, మే2(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో పాలుపంచుకుంటున్న అమానత్ సేవా సొసైటీకి యంగ్ ఇండియన్ సేవా పురస్కారం లభించింది. గురువారం రాత్రి హైదరాబాద్ నగరంలోని నెహ్రూ ఆడిటోరియంలో జరిగిన ప్రధానోత్సవంలో భాగంగా రాయచోటి పట్టణానికి చెందిన అమానత్ సేవా సొసైటీ అధ్యక్షుడు షేక్. అతవుల్లా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అతావుల్లా మాట్లాడుతూ రక్తదానం చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత మంచినీటి సరఫరా

సిద్దవటం, మే 2 (ఆంధ్రజ్యోతి) : గురువారం కురిసిన వర్షం కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో నేకనాపురం గ్రామంలో నీటి కొరత ఏర్పడింది. శుక్రవారం రేషన్ డీలరు ఎద్దుల శ్రీనివాసుల ఆధ్వర్యంలో ట్యాంకరు ద్వారా మంచినీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతిరాజ్ ఛాంబర్ ఆర్గనైజర్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తాగునీరు ఏర్పాటు చేశామన్నారు.

'రైతులు ఆందోళన చెందవద్దు'

సిద్దవటం, మే 2 (ఆంధ్రజ్యోతి) :పెనుగాలుల వర్షానికి దెబ్బతిన్న రైతు పంటలకు ప్రతిరైతుకు న్యాయం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షులు జ్యోతిమోహన్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని పెద్దపల్లి, శివునిపల్లె, మిట్టపల్లె తదితర గ్రా మాల్లో పెనుగాలుల వద్ద దెబ్బతిన్న పంటలకు ప్రతి రైతుకు పంటనష్టం అంచనా వేయడానికి అదికారులు పరిశీలిస్తున్నారన్నారు. ప్రతి రైతుకు న్యా యం జరుగుతుందని జ్యోతి మోహన్‌రెడ్డి తెలియజేశారు. పెనుగాలుల వద్ద కొన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త


గుండయ్య కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాజంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట శ్రీ భువన గిరి లక్ష్మీనరసింహ స్వామిని శుక్రవారం ప్రముఖ పారిశ్రామిక వేత్త గల్లా గుండయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువన గిరి లక్ష్మీనరసింహస్వామి అత్యంత మహిమాన్వితుడన్నారు. స్వామివారి గర్భాలయానికి వెండి తాపడం కోసం రూ.10 లక్షలు విలువజేసే 10 కిలోల వెండిని వితరణ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మాట్లాడుతూ ఆయనకు, కుటుంబ సభ్యులకు స్వామివారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోదుగుల కళావతమ్మ ఇంజనీరింగ్ కళాశాల అధినేత మోదుగుల పెంచలయ్య, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, దేవస్థాన ధర్మకర్తల మండలి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మసీదులో ప్రార్థనలకు ముగ్గురు మాత్రమే

సిద్దవటం, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఎండలు దంచి కొడుతుండటంతో సిద్దవటం కోటకు పర్యాటకుల తాకిడి తగ్గింది. జిల్లా నలువైపుల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సందర్శిస్తుంటారు. గురువారం రాత్రి గాలివాన బీభత్సంతో పాటు ఎండలు తీవ్రంగా ఉండడంతో సిద్దవటం పరకోట జామియా మసీదులో శుక్రవారం ప్రార్థనలకు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆక్స్‌ఫర్డ్ గ్లోబల్ ఫౌండర్ చైర్మన్

రాజంపేట టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఆక్స్‌ఫర్డ్ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా ఫౌండర్ చైర్మన్ భూపతిరాజు సహకారంతో హెచ్.చెర్లోపల్లె గ్రా మంలో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్ వెంకటలక్ష్మి, నరసింహరాజు, రమేష్‌రాజు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్‌రాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలు నీటి సమస్యలతో బాధపడుతున్నారన్నారని, మోకాళ్ల నొప్పులు, ఇతర జబ్బులు రాకుండా ఉండాలంటే స్వచ్ఛమైన నీరు అవ సరమన్నారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ గ్లోబల్ ఫౌండేషన్ చెర్లోపల్లె, తాళ్లపాక, మదనగోపాలపురం, ఒంటిమిట్ట మండలం రాచపల్లె, జ్యోతి కాలనీలను దత్తత తీసుకున్న సందర్భంగా మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 100 మందికి ఉచితంగా తిరుపతి వాసన్ ఐకేర్ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో చేజర్ల సుబ్రమణ్యంరాజు, కోనేటి రవిరాజు, శివరామరాజు, అంజన్‌రాజు, విశ్వనాథ్‌రాజు, జయకృష్ణంరాజు, సుబ్బరామరాజు, వెంకటయ్యనాయుడు, సురేష్‌రాజు, శంకర్‌రాజు పాల్గొన్నారు.

కులగణనపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
చరిత్రాత్మకం: బీజేపీ


ప్రధాన మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

రాజంపేట టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కు లగణనపై బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కులగణన పేరుతో స్వార్థపూరిత రాజకీయాలకు తెరలేపాయన్నారు. దీంతో రాజకీయ అస్త్రంగా వాడుకొని ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేందుకు ప్రయత్నించా యన్నారు. ప్రజా ప్రయోజనాలను కాపాడే విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆదినారాయణ, వీవీ రమణ, రమణారెడ్డి, డాక్టర్ వేణుప్రసాద్‌రాజు, సుబ్రమణ్యం నాయుడు, ఎన్.గిరీష్, తోట నగేష్, రమణ, కృష్ణమురళి, లక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్యుల జయంతి


పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

రైల్వేకోడూరు, మే 2(ఆంధ్ర జ్యోతి): జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తకోడూరులో వెలసిన ఆదిశంకరాచార్యుల మఠంలో ప్ర త్యేక పూజలు చేశారు. రైల్వేకోడూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పిడితల రామ్మోహన్, సంఘం ప్రతినిధులు పెద్ద సురేష్, ఈదర రాము, చిందుకూరు నరసింహశర్మ, మధురభారతం ప్రదీప్, పులిచర్ల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక దర్గా ఉరుసు

రాయచోటిటౌన్, మే2(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని బండ్లపెంటలో వెలిసిన హజరత్ సయ్యద్ యూసుఫ్‌షా ఖాదరి దర్గా ఉరుసు ఉత్సవం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఉరుసు సందర్భంగా శుక్రవారం ఆయన మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్లు, మైనార్టీ సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. చాదర్ సమర్పించి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హరూన్ బాషా, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, షబ్బీర్, రియాజ్, అన్నా సలీం, ఇర్ఫాన్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

రాయచోటిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారిని ఆదుకునే లక్ష్యంతో రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ పేర్కొన్నారు. గురువారం రాత్రి కలకడ బాటవారిపల్లెకు చెందిన సునీత అనే గర్భిణికి వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి రాగా ఓ పాజిటివ్ రక్తం అత్యవసరమని వైద్యులు సూచించడంతో వెంటనే రోగి బంధువులు హెల్పింగ్ హాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్‌ను సంప్రదించగా ఆయన ఓ యువకుడి చేత శ్రీదీప బ్లడ్ బ్యాంక్‌తో రక్తదానం చేయించారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తనిఖీ

నందలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి శుక్రవారం మండలంలోని గొల్లపల్లె, నందలూరు దళితవాడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధులను శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ఇం టింటికి తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ గుడ్లను లార్వా దశలోనే నిర్మూలించాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ వైద్యులు కార్తీక్ విశ్వనాథ్, వెంకటనారాయణ, రాజంపేట మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎస్ఎస్ దాస్, ఆరోగ్య కార్యకర్తలు అంజనమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి మకరతోరణం వితరణ


మకర తోరణం అలంకరణలో కాలభైరస్వామి

రాయచోటిటౌన్, మే2(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని ముసల్‌రెడ్డిగారిపల్లెకు సమీపంలో భైరవగుట్టపై వెలసిన కాలభైరవ స్వామికి శుక్రవారం జంగంరెడ్డిగారిపల్లెకు చెందిన దాత పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, భవానీ దంపతులు మకర తోరణం వితరణ చేశారు. ఆయన కాలభైరవస్వామి ఆలయానికి చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు మకర తోరణాన్ని ఆలయ ధర్మకర్తకు అందజేశారు. ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేటినుంచి యల్లమ్మ జాతర ప్రారంభం

పెనగలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పాతసింగనమల గ్రామంలో శనివారం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గ్రామదేవత యల్లమ్మతల్లి జాతర జరుగుతుందని గ్రామ సర్పంచ్ ఎర్రి శివకుమార్, మాజీ సర్పంచ్‌లు నీరుగట్టు యానాదయ్య, గుండ్లూరు సుబ్బరాయుడు తెలిపారు. సుమారు 44 ఏళ్ల తర్వాత ఈ గ్రామంలో జాతర జరుగుతుండడంతో 2 రోజుల నుంచి గ్రామమంతా సందడి కనిపిస్తోంది.

పోలేరమ్మ గ్రామోత్సవంలో సుగవాసి ప్రసాద్‌బాబు


పోలేరమ్మ ఊరేగింపును ప్రారంభిస్తున్న ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, మే2(ఆంధ్ర జ్యోతి): రాయచోటి పట్టణంలోని పాతరాయచోటిలో శుక్రవారం రాత్రి జరిగిన పోలేరమ్మ గ్రామోత్సవంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పోలేరమ్మ దయతో వర్షాలు సంవృద్ధిగా కురిసి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. మట్టే వారి కుటుంబ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబును సత్కరించారు.

ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

లక్కిరెడ్డిపల్లె, మే2(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ చాటారు. ఏప్రిల్ 20న జరిగిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో సిద్దలవాండ్లపల్లెకు చెందిన షేక్. జోయ, దూదేకులపల్లెకు చెందిన ఆలియా రామాపురం ఏపీ మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యారు. అలాగే సిద్దలవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన చేతన్‌కుమార్‌రెడ్డి, మరో ముగ్గురు కూడా ఎంపికయ్యారు.



అద్భుతంగా అమరావతి


పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం


కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు




సభ ప్రాంగణంలోనే వైద్య సేవలు




మహిళల విజయ దరహాసం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి




దుర్గ గుడి నుంచి సభ వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు


సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు


సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు


గ్యాలరీల బయట జనం

అజ్ఞాతంలోకి 'ఎర్ర' దొంగలు

● పూచీకత్తు ఇచ్చిన ఇద్దరికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరి పూచీకత్తుతో ఐదుగురు నిందితులు జైలు నుంచి విడుదలయ్యారు. వీరిలో ఒకరు చనిపోగా, మిగిలిన నలుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో పూచీకత్తుదారులకు భారీ జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ అధికారి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా పెరియవళ్లి గ్రామానికి చెందిన ఎ.రమేష్, కుమార్, డి.చిన్నస్వామి, సుధాకర్, ఏలుమలై.. చిత్తూరు జిల్లా ఐరాల పరిధిలో ఎర్రచందనం దుంగలు అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదేళ్ల కిందట ఐరాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది రోజుల తర్వాత వీరికి పీలేరుకు చెందిన జి.శేషాద్రి నాయుడు, ప్రసాద్ ష్యూరిటీ ఇచ్చి బెయిల్‌పై విడుదల చేయించారు. బెయిల్‌పై విడుదలైన ఐదుగురిలో ఎ.సుధాకర్ మృతి చెందాడు. మరో నలుగురికి న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్టు చేసి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సొంత పూచీకత్తుపై విడుదల చేయించిన ఇద్దరికి.. ఒక్కో నిందితుడికి రూ.20 వేల చొప్పున జరిమానా చెల్లించాలంటూ శుక్రవారం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు.

జీవనోపాధుల సేవా కేంద్రం.. రైతులకు ఉపయోగం

వీరబల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): జీవనోపాధుల సేవా కేంద్రం రైతులకు ఉపయోగమని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ గంగార్జున తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సముదాయంలో జీవనోపాధుల సేవా కేంద్రం మండల వ్యవసాయ ఉత్పత్తుల సమాఖ్య అధ్యక్షుడు రాచన్న ప్రారంభించారు. సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా జీవనోపాధులు కల్పించడం ద్వారా ఆదాయం పెంపొందించడమే లక్ష్యమన్నారు. మొదటి విడతలో వీరబల్లి, సోమవరం గ్రామంలోని 300 కుటుంబాలను సమీకృత వ్యవసాయ పద్ధతులపై కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏపీఎంలు ఖాదర్‌వలి, రమేశ్‌బాబు, వెంకట్రమణ, సీసీలు గంగాధర్, సుధాకర్, నాగేంద్ర, ఐఎఫ్‌సీ మండల యాంకర్ పర్సన్ అనిత, సీఆర్పీలు జ్యోతి, అనురాధ, రెడ్డెమ్మ, రైతుమిత్ర జనమేజయుడు, బీవోడీ సభ్యులు, ఉపాధి హామీ టీఏ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సచివాలయ ఉద్యోగిపై వైసీపీ మూకల దాడి

● ముగ్గురు యువకులపై కేసు నమోదు

తంబళ్లపల్లె, మే 2(ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడిని దుర్భాషలాడినందుకు ప్రశ్నించిన ఓ సచివాలయ ఉద్యోగిపై వైసీపీ మూకలు కత్తితో దాడి చేసి గాయపరిచాయి. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కృష్ణమూర్తి కుమారుడు గణేశ్(28) చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కురబలకోట మండలం మట్లివారిపల్లె నివాసి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆయన స్నేహితుడు. కొన్ని రోజుల క్రితం తంబళ్లపల్లెకు చెందిన మున్వర్.. ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి, బస్టాండులో బహిరంగంగా దూషించాడు. ఈ విషయం అతను తన స్నేహితుడైన గణేష్‌కు తెలిపాడు. దీంతో తన స్నేహితుడిని ఎందుకు తిట్టావని గణేశ్, మున్వర్‌ను ప్రశ్నించగా.. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి టీడీపీకి చెందిన వ్యక్తి అని, నీవెందుకు అతడికి సపోర్ట్ చేస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో పాటు, నీ అంతు చూస్తానని బెదిరించాడు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం గణేశ్ స్నేహితులతో కలసి తంబళ్లపల్లెలో చికెన్ పకోడా సెంటర్ వద్ద ఉండగా మున్వర్, మహమ్మద్, శశి ద్విచక్రవాహనంలో వచ్చి కత్తితో దాడి చేశారు. విషయం గమనించి స్థానికులు బిగ్గరగా కేకలు వేయడంతో వారు పారిపోయారు. గాయపడిన గణేశ్‌ను స్నేహితులు తంబళ్లపల్లె సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమచికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు గణేష్‌ను పరామర్శించారు. దాడి ఘటనను పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర తీవ్రంగా ఖండించారు. మదనపల్లె జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న గణేష్‌ను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, పార్లమెంట్ తెలుగు యువత జనరల్ సెక్రటరీ షేక్ అయూబ్ బాషా, తంబళ్లపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, బీసీ నాయకుడు తులసీధర్‌నాయుడు, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, కట్టా దొరస్వామి నాయుడు, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గణేశ్‌ను పరామర్శిస్తున్న శ్రీరాం చినబాబు, టీడీపీ నాయకులు, గణేశ్ కాలికి గాయమైన దృశ్యం

బాలుపల్లె అడవిలో మంటలు

● అప్రమత్తమైన అటవీశాఖాధికారులు


మంటలను ఆర్పుతున్న సిబ్బంది

రైల్వేకోడూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలుపల్లె అడవిలో గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగాయి. అటవీశాఖ అధికారులు రాత్రి అప్రమత్తమై మంటలను ఆర్పే పనిలో పడ్డారు. అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్, రైల్వేకోడూరు సబ్‌డీఎఫ్‌వో సుబ్బరాజ్, బాలుపల్లె రేంజర్ ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వివేక్, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన అటవీశాఖ సిబ్బంది కలసి బాలుపల్లె అడవిలోని కంగుమడుగు, మొగిలిపెంట ప్రాంతాల్లో ఉన్న అడవిలో మంటలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీనికితోడు శుక్రవారం వర్షం తోడైంది. దీంతో మంటలను ఆర్పడానికి వరుణదేవుడు కూడా సహకరించాడు. అప్పటికే మంటల్లో అడవిలో జీవిస్తున్న జీవరాసులు కాలిపోయాయి. అనేక అరుదైన చెట్లు, మొక్కలు కాలిబూడిదయ్యాయి. పచ్చని చెట్లు మంటలకు మాడిపోయాయి. అడవిలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించడం, బీడీలు, సిగిరేట్లు తాగి పడవేయడంతోనే మంటలు చెలరేగుతున్నాయని అధికారులు గుర్తించారు. బాలుపల్లె అడవిలో మొదలైన మంటలు తుంబూరుతీర్థం, తిరుమల వైపు వెళ్లాయని అధికారులు అంటున్నారు. అయితే వర్షం పడడంతో చాలా వరకు మంటలు ఆరిపోయినట్లు అటవీశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎర్రచందనం దుంగలు పట్టివేత

● వాహనం స్వాధీనం ● దొంగలు పరార్

ఒంటిమిట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట ఫారెస్ట్ అధికారులు శుక్రవారం ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దుంగలను క్యాబేజీ మూటల మధ్యలో దాచి ఐచర్ వాహనంలో తరలిస్తుండగా స్థానిక అటవీశాఖ అధికారులు వెంటపడి పట్టుకున్నారు. అటవీశాఖ అధికారులకు ముందుగా సమాచారం అందడంతో మాటు వేసి ఒంటిమిట్ట-కడప జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు తెలిసింది. ఐచర్ వాహనంలో సుమారు 80కి పైగా దుంగలు ఉన్నట్లు సమాచారం. ఇన్‌చార్జి రేంజర్ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది మాటువేసి పట్టుకున్నట్లు తెలిసింది. ఐచర్ డ్రైవర్, మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం. పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని, పరారైన వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ఈ ముఠాను గుర్తించేందుకు అటవీశాఖ అధికారులు ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.


దుంగలతో పట్టుబడిన ఐచర్ వాహనం

చెరువులో మునిగి ఒకరి మృతి

నిమ్మనపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): చేపల కోసం వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతిచెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు.. రాచవేటివారిపల్లి పంచాయతీ ఆచార్లపల్లికి చెందిన బోడుమల్ల జగన్నాథం (40) బుధవారం గ్రామానికి సమీపంలో ఉన్న ముసలినాయుని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. తన భర్త ఎక్కడికో వెళ్లి ఉంటాడని భార్య బుజ్జమ్మ కూడా అంతగా పట్టించుకోలేదు. అయితే చెరువులో శవం తేలుతోందని శుక్రవారం స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని వెలికితీసి విచారణ చేశారు. చనిపోయింది తన భర్తేనని బుజ్జమ్మ నిర్ధారించింది. కాగా, చేపలు పట్టే యత్నంలో చెరువులో మునిగి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పురుగుల మందు తాగి యువతి..


ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన యువతి

మదనపల్లెఅర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు ములకలచెరువు మండలం, చిన్నమొరవపల్లెకు చెందిన అమర నాథరెడ్డి భార్య శిరీష(26) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో నెల రోజుల క్రితం వరకు నర్సుగా పనిచేసేది. ఆమె భర్త ఎక్స్‌క వేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వివాహమై ఏడేళ్లైనా పిల్లలు కలుగలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కటుంబసభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ములకలచెరువు పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు..


మృతి చెందిన సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫోటో)

మదనపల్లెఅర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. నందలూరు గ్రామానికి చెందిన కొందరు గంగి రెద్దులు ఆడించేవారు. గురువారం రాత్రి రామసముద్రం మండలం, చెంబకూరు సమీపంలో యల్లమ్మ ఊరేగింపులో పాల్గొన్నారు. వారిలోని సుబ్రహ్మణ్యం (35) అనే యువకుడు బ్యాటరీకి చార్జీ చేయడానికి కరెంటు స్తంభం లైన్‌కు తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రామసముద్రం పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సుభాషిణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రామసముద్రం ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



- ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్
- లీప్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చిన విద్యాశాఖ
- ఉపాధ్యాయులకు విముక్తి కల్పించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



హమ్మయ్యా... యాప్‌ల గోల తప్పింది

కడప ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులకు నరకం చూపారు. విద్యార్థుల హాజరుకు యాప్, ఉపాధ్యాయుల ముఖ హాజరుకు యాప్, మధ్యాహ్న భోజనం అమలుకు యాప్, మరుగుదొడ్ల నిర్వహణకు యాప్, విద్యార్థుల మార్కులు అప్‌లోడ్‌కి యాప్ ఇలా యాప్‌లతో ఉపాధ్యాయులు అల్లాడి పోయారు. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు యాప్‌ల గోలతో ఆపసోపాలు పడాల్సి వచ్చేది. దీంతో తాము బోధనపై దృష్టి సారించలేకపోతున్నామని అప్పటి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టింది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు యాప్ కష్టాల నుంచి విముక్తి కల్పించింది. ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్‌ను అమలు చేయనుంది. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులంటే విద్యార్థులకు బోధన చేయాలి... కానీ గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్‌లతో ఉపాధ్యాయులు బోధన పక్కనపెట్టాల్సి వచ్చేది. ఉపాధ్యాయులు నిత్యం పదికి పైగా యాప్‌లతో సమాచారం పంపాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్‌ల కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తామని యువగళం పాదయాత్రలో నారాలోకేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రిగా ఆయన ఇక పాఠశాల స్థాయిలో ఒకే యాప్‌ను తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

కడప జిల్లాలో మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు 2047 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1.40 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా 7821 మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో యాప్‌ను ప్రవేశపెట్టారు. కేవలం ఉపాధ్యాయులపై కక్షసాధింపులా యాప్‌లను ప్రవేశ పెట్టారన్న విమర్శలు వచ్చినా.. యాప్‌ల కష్టాల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు రోడ్డెక్కినా నాటి ప్రభుత్వం స్పందించ లేదు. దాదాపు పదికిపైగా యాప్‌లతో నిత్యం ఉపాధ్యాయులు కుస్తీ పడాల్సి వచ్చేది.

ఇక అన్నింటికి ఒకేయాప్

ప్రభుత్వం తాజాగా లెర్నింగ్ ఎక్సెలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో నూతన యాప్‌ను తీసుకువచ్చింది. లీప్ యాప్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసింది. కడప జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఈ యాప్ ఆండ్రాయిడ్ 8, ఇతర వెర్షన్ మొబైల్ ఫోన్‌లలో పనిచేస్తుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి స్కూల్ అటెండెన్స్ యాప్‌లో విని యోగిస్తున్న లాగిన్లను పాస్‌వర్డ్‌లను ఉపయోగించి నూతన యాప్‌లో లాగిన్ కావాలని స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, సెలవులను యాప్‌లో మాత్రమే నమోదు చేయాల్సి ఉంది.

పనిభారం తగ్గింపు



నూతన యాప్ వల్ల ఉపాధ్యాయుల పనిభారం తగ్గుతుంది. పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారం ఒకేయాప్ నమోదు చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయి. గతంలో ఉన్న యాప్‌లను అన్‌ఇన్‌స్టాల్ చేసే ముందు యాప్‌లకు సంబంధించిన లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఒకచోట నమోదు చేసుకోవాలి.

- షంషుద్దీన్, డీఈఓ

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

పెనగలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరులో వెలసిన వేణుగోపాల స్వామి దేవాలయంలోని నూతన కల్యాణ మండపంలో గురువారం రాత్రి రుక్మిణి, సత్యభామ సమేతుడైన వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రూ.15 లక్షలతో గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు కల్యాణ మండపం నిర్మించారు. అమెరికాలో స్థిరపడిన కమ్మ సంఘంలోని ఓ భక్తుడు వరుడు, వధువు గదులను నిర్మించారు. రూ.15 లక్షల విరాళంతో ఉపసర్పంచ్ డి.చిన్నవెంగళరెడ్డి కల్యాణ మండపం చుట్టూ ప్రహరీ నిర్మించారు. కల్యాణోత్సవం తర్వాత భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. అనంతరం నూతన మండపంలో హరికథాగానం జరిగింది. గరుడ వాహనంపై రుక్మిణి, సత్యభామ సమేతుడైన వేణుగోపాలుడు భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్యుల జయంతి

రైల్వేకోడూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తకోడూరులో వెలసిన ఆదిశంకరాచార్యుల మఠంలో ప్రత్యేక పూజలు చేశారు. రైల్వేకోడూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పిడితల రామ్మోహన్, సంఘం ప్రతినిధులు పెద్ద సురేష్, ఈదర రాము, చిందుకూరు నరసింహశర్మ, మధురభారతం ప్రదీప్, పులిచర్ల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక దర్గా ఉరుసు

రాయచోటిటౌన్, మే2(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని బండ్లపెంటలో వెలిసిన హజరత్ సయ్యద్ యూసుఫ్‌షా ఖాదరి దర్గా ఉరుసు ఉత్సవం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఉరుసు సందర్భంగా శుక్రవారం ఆయన మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్లు, మైనార్టీ సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. చాదర్ సమర్పించి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హారూన్‌బాషా, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, షబ్బీర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తనిఖీ

నందలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి శుక్రవారం మండలంలోని గొల్లపల్లె, నందలూరు దళితవాడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధులను శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ఇంటింటికి తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ గుడ్లను లార్వా దశలోనే నిర్మూలించాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ వైద్యులు కార్తీక్ విశ్వనాథ్, వెంకటనారాయణ, రాజంపేట మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎస్ఎస్ దాస్, ఆరోగ్య కార్యకర్తలు అంజనమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి



నాగేశ్వర్ మృతదేహం

మైలవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన మేకల నాగేశ్వర్ (26) అనే వ్యక్తి పిడుగుపాటుకు మృతి చెందాడు. తలమంచిపట్నం పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... గొల్లపల్లెలోని మిరపకాయల కలంలో మిరపకాయలను సంచులకు ఎత్తే సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు మెరువడంతో ఆ శబ్దానికి నాగేశ్వర్ భయాందోళనకు గురై ఒక్కసారిగా కిందపడిపోయాడు. వెంటనే అక్కడున్నవారు వద్దిరాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగేశ్వర్ కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక పాపకు మూడేళ్లు కాగా.. బాబు పుట్టి వారం రోజులైందని, అంతలోనే ఈ దుర్ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు,బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. నాగేశ్వర్ భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు తలమంచిపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈదురుగాలుల బీభత్సం.. దెబ్బతిన్న పంటలు





పడిపోయిన మామిడి చెట్ల వద్ద రైతు జగన్‌మోహన్‌రెడ్డి, ఈదురుగాలులకు పడిపోయిన అరటి పంట

సీకేదిన్నె, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని చెట్లు కరెంటు స్తంభాలు సైతం పడిపోయాయి. బొగ్గులపల్లె పంచాయతీ గూడావాండ్లపల్లె, బుగ్గలపల్లె, ఇప్పెంట పంచాయతీల్లో మామిడి, అరటి రైతులు భారీగా నష్టపోయారు. గూడావాండ్లపల్లెలో రైతు జగన్‌మోహన్‌రెడ్డి తన ఆరు ఎకరాల పొలంలో దాదాపు నాలుగేళ్ల వయస్సు ఉన్న వందకుపైగా మామిడి చెట్లు నేలకొరిగాయి. కాపుకు వచ్చి పంట చేతికొచ్చే సమయంలో చెట్లు నేలకొరగడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా క్రిష్టారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఇప్పెంటలోని నాగరాజు, తదితరుల అరటి చెట్లు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఖాజీపేట మండలంలో...



రేకులు కొట్టుకుపోయిన గృహం

ఖాజీపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించే రైతన్నలకు ఏదో ఒక రూపంలో నష్టం వాటిల్లుతోంది. గురువారం రాత్రి ఖాజీపేట మండల పరిధిలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో రైతన్నలు నూర్పిడి చేసేందుకు పట్టలపై వేసిన నువ్వుల పంట కొట్టుకుపోయి నువ్వులు నేలపాలయ్యాయి. అలాగే మండల పరిధిలోని పుల్లూరు మాలవాడలో ఓబయ్య, జ్యోతిలు గృహాలకు ఏర్పాటు చేసుకున్న రేకులు కొట్టుకుపోయాయి. దీంతో ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

65 మద్యం బాటిళ్లు స్వాధీనం



అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

ఎర్రగుంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): రైలులో అక్రమంగా తరలిస్తున్న 65 మద్యం బాటిళ్లను ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు పూణే జయంతి ఎక్స్‌ప్రెస్‌లో ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకువెళుతున్న 65ఫుల్ మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వీటిని పాండిచ్చేరి నుంచి నంద్యాలకు తీసుకెళుతున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైలుదిగి మద్యం బాటిళ్లతో వెళుతున్న వారిని ప్లాట్‌ఫారంపై పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

కడప క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం కడప నగరంతో పాటు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లోని అన్ని కూడళ్లలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది రద్దీ ప్రదేశాల్లో, ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. వారి వివరాలను ఆరా తీశారు. లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పోరుమామిళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో స్వాతి అనే వివాహిత విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శుక్రవారం సాయంత్రం విష ద్రావణం తాగి ఆ మహిళ అపస్మారక స్థితిలో ఉండడంతో గమనించిన కొందరు 108కు సమాచారం ఇవ్వడంతో వారు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది. అక్కడ వారికి తన పేరు స్వాతి అని చెప్పినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని శవం లభ్యం

పోరుమామిళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మనపల్లె నుంచి కట్టకింద వెళ్లే దారి మధ్యలో గుర్తుతెలియని శవం బయటపడినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కొందరు ఆ దారి వెంబడి వెళుతుండగా నీటిలో తేలియాడుతూ శవం కంటపడిందని తెలిపారు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదు. కాగా ఇది కలసపాడు పరిధిలోకి వస్తుందా, పోరుమామిళ్ల పరిధిలోకి వస్తుందా అని ఆ ప్రాంత వాసులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక తర్జనభర్జనపడుతున్నారు. అయితే పోలీసులకు మాత్రం ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ప్రొద్దుటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అర్బన్, రూరల్ పరిధిలోని రెండు రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం వేర్వేరుగా దాడులు నిర్వహించారు. ప్రొద్దుటూరు సూపర్ బజార్‌వీధిలోని డీలర్ ఎరికలరెడ్డికి చెందిన షాపునెంబరు 14లో విజిలెన్స్ సీఐ శివన్న దాడులు నిర్వహించారు. 96.50 క్వింటాళ్ల బియ్యం, 525 ప్యాకెట్ల చెక్కర నిల్వల్లో తేడాలున్నాయి. దీంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే పెద్ద శెట్టిపల్లెలోని డీలర్ బి.ఆదిలక్ష్మికి చెందిన షాపు నెంబరు 93 రేషన్ దుకాణంపై విజిలెన్సు సీఐ నారాయణప్ప ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో షాపులో 44.50 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, 306 చెక్కర ప్యాకెట్లు నిల్వల్లో తేడాలున్నట్లు గుర్తించారు. దీంతో ఆదిలక్ష్మిపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడుల అనంతరం బియ్యం చెక్కర నిల్వలను సివిల్ సప్లయి డీటీ మల్లికార్జున, ఎఫ్ఐ మహేంద్రరెడ్డిలకు విజిలెన్సు అధికారులు అప్పగించారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు.. తహసీల్దారు విచారణ

ప్రొద్దుటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె పంచాయతీ శంకరాపురం గ్రామానికి చెందిన పల్లబోతుల సుబ్బలక్షుమ్మ అనే వృద్ధురాలు పెద్దశెట్టిపల్లె, చౌడూరు గ్రామ పొలాల్లోని తన 170 ఎకరాల భూమిని 12 మంది ఆక్రమించారని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహసీల్దారు గంగయ్య సుబ్బలక్షుమ్మ ఆరోపించిన 12 మందికి నోటీసులు జారీ చేసి.. శుక్రవారం తన కార్యాలయంలో విచారణ చేపట్టారు.

కాగా విచారణకు 12 మందిలో ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. వీరిని సుబ్బలక్షుమ్మకు సంబంధించి 170 ఎకరాల భూములను ఆక్రమించారా అని తహ సీల్దారు ప్రశ్నించారు. ఇందుకు వారు సుబ్బలక్షుమ్మ భూములకు సంబంధించిన ఆధారాలు చూపమన్నారు. ఇందుకు సుబ్బలక్షుమ్మను ఆధారాలు చూపమని కోరగా.. తన ఆస్థి పత్రాలు చూపడానికి వాయిదా కోరింది. దీంతో మే 14 నాటికి విచారణను తహసీల్దారు వాయిదా వేశారు. ఈ విచారణలో డిప్యూటీ తహసీల్దారు వెంకటసాయినాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్వో సుధీర్‌లు పాల్గొన్నారు.

కాలబైరవ స్వామికి మకరతోరణం వితరణ



రాయచోటిటౌన్, మే2(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని ముసల్‌రెడ్డిగారిపల్లెకు సమీపంలో బైరవగుట్టపై వెలసిన కాలబైరవ స్వామికి శుక్రవారం జంగంరెడ్డిగారిపల్లెకు చెందిన దాత పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, భవానీ దంపతులు మకర తోరణం వితరణ చేశారు. ఆయన కాలబైరవ స్వామి ఆలయానికి చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు మకర తోరణాన్ని ఆలయ ధర్మకర్తకు అందజేశారు. ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

మత్స్యశాఖ ఏడీగా శ్యామలమ్మ బాధ్యతలు

కడప రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఏడీగా శ్యామలమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈమె నంద్యాల ఏడీగా పనిచేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి, ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడతామన్నారు.

వైద్యుల కొరత.. రోగుల కలత!

● ఏడుగురు వైద్యులకు బదులు ముగ్గురే విధుల్లో..
● ఆర్థోపెడిక్ చికిత్సలకు మదనపల్లె వెళ్లాల్సిందే.. ● నిరుపయోగంగా నూతన భవనం

తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరతతో పేద రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసినా స్పెషలిస్ట్ వైద్యులు లేకపోవడంతో మెరుగైన వైద్య సేవలు అందుతాయనుకున్న స్థానికుల ఆశ నిరాశగానే మిగిలింది. రోజూ వందల సంఖ్యలో ఓపీ ఉన్నా అందుకు తగ్గట్లు వైద్యులు లేకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఏడుగురు వైద్యులు సేవలందించాల్సి ఉండగా.. రెండు ముఖ్య విభాగాలకు వైద్యులు లేకపోవడం, ఇద్దరు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ముగ్గురు వైద్యులు మాత్రమే సేవలందిస్తున్నారు.

తంబళ్లపల్లె, మే 2(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సీహెచ్‌సీకి మండల ప్రజలే కాకుండా పెద్దమండ్యం, ములకలచెరువు నుంచి ప్రతి రోజూ 100 నుంచి 200 మంది వరకు రోగులు వస్తుంటారు. సోమవారం రోగుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఆసుపత్రిలో స్త్రీ వైద్య నిపుణురాలు, చిన్నపిల్లల వైద్యుడు, అనస్థిస్ట్ మాత్రమే సేవలందిస్తున్నారు. ఆసుపత్రిలో మరో ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు ఉండగా.. ఒకరు పక్క మండలమైన బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి, మరొకరు 104లో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు అందించడానికి డిప్యుటేషన్ పైన వెళ్లారు. ఇక ఆసుపత్రిలో జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ వైద్యులు చాలా కాలంగా లేరు. దీంతో పాటుగా ఆప్తాల్మిక్, ఆర్థోపెడిక్ విభాగాలకు వైద్యులు లేరు. అందుబాటులో ఉన్న ముగ్గురు వైద్యులే ఓపీలు చూస్తూ ఇన్‌పేషంట్లకు చికిత్సలు, తదితర సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఓపీల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు లేక రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రి స్థాయికి తగ్గట్టుగా పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.



తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి

ఆర్థోపెడిక్ వైద్యుడు లేక ఇబ్బందులు

తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతూ వైద్య సేవల కోసం మదనపల్లెకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ఆసుపత్రికి రోడ్డు ప్రమాదంలో గాయపడి కాళ్లు, చేతులు, ఎముకలు విరిగిన రోగులు ఎక్కువగా వస్తుంటారు. అటువంటి వారికి చికిత్స అందించడానికి ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు ఉండాల్సిన అవసరం ఉంది. అయితే ఇక్కడ ఆర్థోపెడిక్ వైద్యుడు లేకపోవడంతో విధుల్లో ఉన్న వైద్యులు ప్రథమ చికిత్స అందించి మదనపల్లెకు రెఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు చేసేదేమీ లేక మదనపల్లెకు వెళ్లి వైద్య సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిరుపయోగంగా నూతన భవనం

తంబళ్లపల్లె సీహెచ్‌సీలో నిర్మించిన అదనపు ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించి ఇప్పటికి ఏడాది పైగా గడుస్తున్నా వసతులు ఏర్పాటు చేయకపోవడంతో నేటికీ అందుబాటులోకి రాలేదు. కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వాసుపత్రిలో సుమారు రూ.4.65 కోట్ల నిధులలో గత వైసీపీ ప్రభుత్వంలో అదనపు ఆసుపత్రి భవనం నిర్మించారు. అయితే, విద్యుత్, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు సైతం లేకుండానే ఎన్నికలు సమీపిస్తున్నాయనే కారణంతో గత ఏడాది మార్చిలో హడావుడిగా ప్రారంభించేశారు. నూతన భవనంలో పనులు పూర్తి కాకపోవడంతో ఆసుపత్రి వర్గాలు ఆ భవనాన్ని స్వాధీనం చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తే మరింత మెరుగ్గా వైద్య సేవలు పొందవచ్చని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

ఆసుపత్రిలో వైద్యుల కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అతి త్వరలోనే ఆసుపత్రికి తగ్గట్టుగా పూర్తి స్థాయిలో వైద్యులను నియమిస్తామని వారు తెలిపారు. అయితే, ఉన్న ముగ్గురు వైద్యులం నిరంతరం ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ రోగులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

- తేజస్విని, వైద్యాధికారిణి


అందుబాటులోకి రాని నూతన ఆసుపత్రి భవనం

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

● గ్రామ కార్యదర్శిపై డీఎల్‌పీవో నాగరాజ ఆగ్రహం


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజ

నిమ్మనపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): పనితీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తామని అగ్రహారం కార్యదర్శి శ్రీనాథ్‌పై డీఎల్‌పీవో నాగరాజ అగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో పరమేశ్వరెడ్డి, ఏవో రమేష్‌తో కలసి అగ్రహారం పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ హాజరు పట్టికను పరిశీలించగా కార్యదర్శి సక్రమంగా విధులకు హాజరు కాలేదని తెలిసింది. చెత్త సంపద కేంద్రంలో చెత్త సేకరించిన ఆనవాళ్లు కూడా కనిపించక పోవడంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు విధుల నిర్వర్తించకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై కార్యదర్శి శ్రీనాథ్ మౌనం వహించడంతో విధులు సక్రమంగా నిర్వహించకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ ఇంటి పన్ను , శానిటేషన్, తాగునీరు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా చెత్త పొడి, తడి చెత్తను సేకరించి సంపద కేంద్రాల్లో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు మారెప్ప, వెంకటరమణ, గౌతమి, గాయత్రి సరస్వతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరుకు చేరిన పాఠ్యపుస్తకాలు


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న పీలేరు ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ

పీలేరు రూరల్, మే 02 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇవ్వనున్న పాఠ్యపుస్తకాలు పీలేరు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకున్నాయి. శుక్రవారంపీలేరు ఎంఈవోలు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతమ్మ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ. నటరాజ పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 పద్మావతమ్మ మాట్లాడుతూ పీలేరు మండలంలో 57 ప్రాథమిక, 15 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు 4 రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు ఉండగా, 6207 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ ఏడాది పాఠశాలల పునః ప్రారంభం నాటికే పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందులో భాగంగా పీలేరు మండలానికి ఇప్పటికే 70 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, 3 జతలు యూనిఫాం, ఒక జత షూస్, రెండు జతల సాక్స్‌లు, బెల్టులు, 1వ, 6వ తరగతి విద్యార్థులకు డిక్షనరీ , ఒక బ్యాగ్ ఉంటాయన్నారు. ప్రైవేట్ పాఠశాలల ప్రకటనలకు మోసపోవద్దని, మంచి ఫలితాలకు కేరాఫ్‌గా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు పిల్లలందరూ చేరాలని ఆమె కోరారు.

గాలివానతో అపార నష్టం

● నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ ట్రాన్స్‌పార్మర్లు


నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ఏఈ సురేంద్ర

తంబళ్లపల్లె,మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సానికి అపార నష్టం సంభవించింది. కోసువారిపల్లె పంచాయతీలో ఎనిమిది కరెంటు స్తంభాలు నేలకొరగ్గా.. రెండు 25 కేవీఏ వ్యవసాయ ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతిన్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సురేంద్ర తెలిపారు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింటుందని ఏఈ తెలిపారు. కోసువారిపల్లె-ముదివేడు మార్గంలో అనిగానిపల్లె వద్ద రోడ్డుపై ఓ పెద్ద చెట్టు విద్యుత్ లైన్లపై పడటంతో రెండు కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. ఏఈ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన స్తంభాలు నాటి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో గాలి వాన దెబ్బకు మామిడికాయలు రాలిపోయి నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ అహ్మద్

పెద్దమండ్యం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాలు, ఇళ్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులందరూ గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా దరఖాస్తుదారుడి అర్హత బట్టి 3 సెంట్లు స్థలం, పక్కాగృహాలు మంజూరు చేస్తారని తెలిపారు. గతంలో ఇంటి పట్టాలు పొందిన వారు, ఇళ్లు మంజూరు అయిన వారు అనర్హులని తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న అర్హులైన వారు క్రమబద్ధీకరణ చేసుకోవచ్చన్నారు. వెలిగల్లు రీసర్వే తుది దశకు చేరుకుందన్నారు. తరవాత దిగువపల్లి గ్రామ పంచాయతీలో రీ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, సర్వేయర్ హసీన్‌తాజ్, వీఆర్వోలు అంజినేయులు, మంజునాథరెడ్డి, విశ్వంభరనాయుడు, నవాజ్, రెడ్డిశేఖర తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన


కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్యసిబ్బంది

పెద్దతిప్పసముద్రం,మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మే 2 నుంచి జూన్ 10 వరకు వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో భాగ్యమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె కార్యక్రమాలను పర్యవేక్షించారు. పంచాయతీ పరిధిలోని 11-18 ఏళ్ల పిల్లలను గ్రూపులుగా విభజించి వారికి వ్యక్తిగత విషయాలపై వివరించారు. బాలల హక్కుల రక్షణ, పోక్సో చట్టాల గురించి ఆడ పిల్లలకు వివరించారు. విద్య ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత తదితర అంశాలపై చర్చించారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, లింగ వివక్ష, ఆర్థిక అసమానతలతో కలిగే అనర్థాలను వివరించారు. శక్తి యాప్‌తో ఉపయోగాలు వివరించారు. శారీరక వ్యాయామం , ఉన్నత విద్య కెరీర్ మార్గదర్శకత్వంపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు వైద్య సిబ్బంది, గ్రామ పోలీసులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి బీపీ యంత్రాల వితరణ



వైద్య సిబ్బందికి బీపీ యంత్రాలను అందజేస్తున్న యంగ్‌ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు

పెద్దతిప్పసముద్రం మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తగాది రాజశేఖర్ శుక్రవారం పీటీఎం ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బందితోపాటు, మండలంలోని 24 సచివాలయాల పరిధిలో ఉన్న ఏఎన్‌ఎంల కు 34 బీపీ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక డాక్టర్ మహ్మద్ ఎ స్తానీ, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈవో గౌస్‌పీర్, సూపర్‌వైజర్లు విజయకుమారి, రెడ్డెప్ప, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం మే 2 (ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితులు కన్నాస్వామి, పణితేజస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అన్నదానం చేశారు.

'వైఎస్ షర్మిల హౌస్ అరెస్టు అప్రజాస్వామికం'

మదనపల్లె అర్బన్, మే2 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హౌస్ అరెస్టు అప్రజాస్వామికమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ షర్మిలను పీసీసీ కార్యాలయానికి కూడా వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే అన్నారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీల సూచనలను స్వీకరించి ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించాలని కోరారు.

నీడనిచ్చి.. సేద తీరుస్తున్న మర్రిచెట్టు



వాల్మీకిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతుండడంతో జనం విలవిలలాడిపోతున్నారు. శుక్రవారం ఎండ తీవ్రత మరింత అధికం కావడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇలాంటి తరుణంలో పట్టణ నడిబొడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న 170 ఏళ్లనాటి అతిపెద్ద మర్రిచెట్టు పాదచారులు, వాహనదారులకు సేదతీరుస్తోంది. అటుగా వచ్చి వెళ్లే జనం కాసేపు చెట్టు కిందకు చేరి ఉపశమనం పొందుతున్నారు.

వెలగని హైమాస్ట్ లైట్



కలకడ, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద ఉన్న హైమాస్ట్ లైట్ కొన్ని ఏళ్లుగా వెలగడం లేదు. రోడ్డు విస్తరణలో భాగంగా హైవే అధికారులు పెద్ద స్తంభానికి లైట్లు ఏర్పాటు చేశారు. ఈ లైట్లు కొద్ది రోజులపాటు మాత్రమే కాంతులను వెదజల్లాయి. ప్రస్తుతం లైట్లు వెలగకపోడంతో ఈ ప్రాంతం అంధకారంగా మారింది. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి లైట్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

యువకుడి దారుణ హత్య


శేషప్పతోటలో హత్యకు గురైన యువకుడు

మదనపల్లె అర్బన్, మే2(ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణం, శేషప్పతోటలో శుక్రవారం ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. రాత్రి 9 గంటల సమయంలో శేషప్పతోటలో మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో టూటౌన్ సీఐ రామచంద్ర సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బసినికొండకు చెందిన రఘు కుమారుడు సునీల్‌కుమార్ (24) బేల్దారి పని, ఎలక్ట్రిక్ పనులు చేస్తుంటాడు. ఇతని తలపై బండరాళ్లతో కొట్టి చంపినట్లు పోలీసులు గుర్తించారు. అతని స్నేహితులు బాలాంజనేయులు, గౌతమ్‌లపై అనుమానం ఉన్నట్లు మృతుడి అక్క శశికళ పోలీసులకు తెలిపింది. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

మహిళలు మెచ్చిన నాయకుడు చంద్రబాబు

● ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు మొదలుకుని ఎన్నో మహిళా సంక్షేమ పథకాలు అమలు చేసి మహిళల మన్ననలు పొందిన ఏకైక నాయకుడు సీఎం నారా చంద్రబాబునాయుడు ఒక్కరేనని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వాల్మీకిపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళల కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా కూడా ఎదగాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారన్నారు. కుట్టు శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణ పూర్తవగానే కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. పీలేరు-కలికిరి మార్గంలో గార్మెంట్ పరిశ్రమ నిర్మించేందుకు అవసరమైన భూముల కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే మహిళలు పీలేరు, కలికిరి, మదనపల్లె ప్రాంతాలకు వెళ్లి టైలరింగ్ శిక్షణ పొందుతున్నారని, గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటుతో 5వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. పేదరికం లేని సమాజం, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు వాల్మీకిపురం ముఖద్వారం నుంచి స్వాగతం పలికారు. తన కోసం ఎదురు చూసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల రమణ, ఎంపీడీవో మనోహర్‌రాజు, ఈవో రవీంద్రనాథ్, మాజీఎంపీపీ సురేంద్రవర్మ, నాయకులు కృష్ణారెడ్డి, కోసూరి రమేష్, రాజేంద్రాచారి, శేషాద్రిరెడ్డి, మైనార్టీ నేత సయ్యద్‌బాషా, ఆనంద, మురళి, కువైట్ సయ్యద్‌బాషా, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం వైద్యుల బాధ్యత

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం వైద్యులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన సోదరుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో వాల్మీకిపురంలో వంద పడకల ఆస్పత్రికి రంగం సిద్ధం చేసినా అది ప్రస్తుతం 50పడకలకే పరిమితం అయిందన్న విషయాన్ని గుర్తు చేశారు. గత వైసీపీ పాలనలోనే నిరుపేదల సంక్షేమం పూర్తిగా కనుమరుగైందని ఆరోపించారు. నిత్యం వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలని, ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, డాక్టర్లు సోని, ఆసిఫ్, శివాని , హర్షిత, జ్ఞానేశ్వర్, మమత ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లోని పేదల ఇళ్లను క్రమబద్ధీకరించండి

● సబ్ కలెక్టర్ మేఘస్వరూప్


రేషన్ షాపును తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దతిప్పసముద్రం మే 2 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి వివాదం లేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు జీఓ 30 ప్రకారం క్రమబద్ధీకరించుకోవచ్చునని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. అలాంటి ఇళ్లను క్రమబద్ధీకరించి వారికి పట్టాలు అందజేయాలని తహసీల్దార్లకు సూచించారు. మండలంలోని రంగసముద్రం, రాపూరివాండ్లపల్లె గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ముందుగా రంగసముద్రం గ్రామంలో గోకులం షెడ్‌ను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో కలసి రాపూరివాండ్లపల్లె పంచాయతీ నాగన్నకోటలో ప్రభుత్వ స్థలంలో పేదలు నిర్మించుకున్న గృహాలను పరిశీలించారు. జీఓ 30 ప్రకారం ఆయా ఇళ్ల యజమానులైన 13 మంది పేదలకు శాశ్వత పట్టాలను మంజూరు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నవారెవరైనా పట్టాలను పొందవచ్చన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీరాములు నాయక్, మండల సర్వేయర్ శ్రీవాణి, వీఆర్వో అహ్మద్ బాషా పాల్గొన్నారు.

బి.కొత్తకోట: మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ శుక్రవారం బి.కొత్తకోట మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. బయ్యప్పగారిపల్లె పంచాయతీ పరిధిలోని పరిశోధనా కేంద్రం కోసం కేటాయించిన 88 ఎకరాల భూములను పరిశీలించారు. ఆ భూములు ఎప్పుడు సేకరించారు. పరిశోధనా కేంద్రం పనులు ఎంత వరకు వచ్చాయి. విడుదలైన నిధులపై ఆరా తీశారు. అనంతరం గోళ్లపల్లె గ్రామంలోని 33వ నంబరు రేషన్ షాపును తనిఖీ చేశారు. షాపు నిర్వహణ తీరుపై కార్డుదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. రేషన్ షాపులపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ అజారుద్దీన్, వీఆర్వో నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

అంగరంగ వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి


బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో గాయత్రీదేవి, జగద్గురు ఆదిశంకరాచార్యుల చిత్రపటాలు ఊరేగిస్తున్న వటువులు

పీలేరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా శుక్రవారం పీలేరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనాలు చేశారు. ఉదయం 5 గంటలకు గణపతి పూజ, స్వస్తి వాచనం, గణపతి హోమం, నవగ్రహ పూజ, బ్రహ్మోపదేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గాయత్రీదేవి, శంకరాచార్యుల చిత్రపటాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పీలేరు బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్ర శర్మ, తెనాలి రామసుబ్రమణ్యం, గొల్లాపిన్ని ప్రభాకర్ రావు, నరసింహమూర్తి, జీవీఎస్ఆర్‌కే ప్రసాద్, కే. వెంకటేశ్వర్లు, వేంపల్లె నరసయ్య, చంద్రాస్వామి, బాలాచార్, విరూపాక్షం కాశీనాథ్, ఉద్యా మయూరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : శంకరబ్రాహ్మణ సేవా సహకార సమితి ఆధ్వర్యంలో చిప్పిలిలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక ధర్మోపనయన కార్యక్రమం నిర్వహించినట్లు ఆ సమితి గౌరవ అధ్యక్షుడు కామకోటి ప్రసాదరావు, అధ్యక్షుడు కోదండరామయ్య తెలిపారు. ఉదయాన్నే ఉపనయన వేడుక నిర్వహించారు. అనంతరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎ. మనోజ్ఞను, బెస్ట్ టీచర్ అవార్డు పొందిన వరప్రసాద్ ను, నంది అవార్డు పొందిన ఉపాధ్యాయిని కల్యాణిని సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అమరనాథ్, ఆడిటర్ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు నరసింహులు, కార్య నిర్వాహక కార్యదర్శి రఘునందన్, జి.ప్రకాష్, సీ.ప్రకాష్, పద్మావతి, నాగప్రభ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.